| **Headline:** We will support Investors - SEBI & NSE officers | |
|---|---|
| **Source:** Eenadu | **Date:** 04 October 2015 |

# మదుపర్లకు అండగా ఉంటాం...

## ప్రాంతీయ సదస్సులో సెబీ, ఎన్ఎస్ఈ అధికారులు

**రాజమండ్రి(ప్రకాశంనగర్), న్యూస్‌టుడే:** దేశవ్యాప్తంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో షేర్ల కొనుగోళ్ల ద్వారా పెట్టుబడులు పెట్టే మదుపరుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబి), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లు ఎప్పుడూ ముందుంటాయని సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌వి.మురళీధరరావు అన్నారు. సెబీ, ఎన్ఎస్ఈ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాజమండ్రిలోని ఓ హోటల్‌లో మదుపర్ల ప్రాంతీయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మురళీధరరావుతో పాటు ఎన్ఎస్ఈ చీఫ్ రెగ్యులేషన్స్ అధికారి డాక్టర్ వి.ఆర్.నరసింహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మదుపర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏజెన్సీల ద్వారా మోసపోయామని భావించే వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే బ్రోకర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మదుపర్లు ఏరోజు ట్రేడింగ్ వ్యవహారాలను ఆ రోజే ఎస్ఎంఎస్, మెయిల్ ద్వారా తెలుసుకునే వీలు ఉందన్నారు. బ్రోకర్లు ఎటువంటి మోసాలకు పాల్పడినా సహించేది లేదన్నారు. ఈక్విటీల్లో పెట్టుబడి పెట్టే వారితో పాటు మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెరుగుతుండడడం అభినందనీయమన్నారు. మ్యూచ్‌వల్ ఫండ్ల ద్వారా సుమారు రూ. 11 లక్షల 75 వేల కోట్ల మేర మదుపు చేశారన్నారు. ఈ క్విటీల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాలు ఆర్జించే వీలుందన్నారు. మార్కెట్ తీరుతెన్నులను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదని, దీర్ఘకాలికంగా వేచిఉండడం వల్ల సత్ఫలితాలు వచ్చే అవకాశాలు ఎక్కువని ఎస్.వి.మురళీధరరావు వివరించారు. అనంతరం ఎన్ఎస్ఈ చీఫ్ రెగ్యులేషన్స్ అధికారి డాక్టర్ వి.ఆర్.నరసింహన్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి ఈ ఏడాది ఇప్పటి వరకు 65 వరకు నిర్వహించామన్నారు. వారితో పాటు సెబీ ఏజీఎమ్ టి.శ్రీనివాసన్, యూటీఐ మ్యూచువల్ ఫండ్‌కు చెందిన కెవిఎన్.శేఖర్‌లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మదుపర్లతో పాటు వివిధ కళాశాలలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.




**సమావేశంలో ప్రసంగిస్తున్న ఎన్.ఎస్.ఇ. చీఫ్ రెగ్యులేషన్స్ అధికారి డాక్టర్ వి.ఆర్.నరసింహన్**